నమస్తే తెలంగాణ
నిజామాబాద్, సోమవారం 18 మార్చి 2024
MONDAY, MARCH 18, 2024

భక్తిమాలిక పుస్తకావిష్కరణ

పుస్తకావిష్కరణలో పాల్గొన్న కవులు

సుభాష్‌నగర్, మార్చి 17 : ఉపాధ్యాయుడు, కవి తంగుడిగె శ్రీనివాస్‌రావు రచించిన పద్యఖండిక 'భక్తిమాలిక' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని పద్మభారతి ఇందూరు సాహిత్యసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నగరంలోని దత్తాశ్రమంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖకవి డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు అధ్యక్షత వహించారు. కాసర్ల నరేశ్‌రావుతోపాటు ముఖ్యఅతిథిగా డాక్టర్ అశోక్‌శర్మ, పుస్తకావిష్కర్త తల్లావఝుల మహేశ్‌బాబు, ప్రముఖ పద్యకవి ఓంప్రకాశ్ బొచ్కర్ మాట్లాడుతూ.. సైన్సు, గణితాన్ని జోడించి పుస్తకాలు రాయడం శ్రీనివాసరావుకే చెల్లిందని కొనియాడారు. కార్యక్రమంలో గెజిటెడ్ హెచ్‌ఎం రామ్మోహన్, కాసర్ల కరుణాకర్, ఇప్పకాయల సుదర్శన్, చిల్క అరుంధతి, అపర్ణ శ్రీనివాస్, తంగుడిగె గంగాదేవిని తదితరులు హాజరయ్యారు.

ఇతిహాస సంకలన సమితి ఆధ్వర్యంలో చర్చాగోష్టి

సుభాష్‌నగర్, మార్చి 17 : ఇతిహాస సంకలన సమితి –ఇందూరు ఆధ్వర్యంలో నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో భారతదేశ చరిత్రలో వక్రీకరణలు – వాస్తవాలు అంశంపై చర్చాగోష్టి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రముఖ చరిత్ర పరిశోధకుడు బొమ్మరాజు సారంగపాణి, రచయిత్రి లక్ష్మి, విజయ్‌సారథి, సారంగమణి, కందకుర్తి యాదవరావు తదితరులు మాట్లాడుతూ.. సుదీర్ఘ చరిత్ర కలిగిన మనదేశ చరిత్రను భావితరాలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చరిత్రకు ఎర్రతెగులు, ఇందూరు దేవాలయాలు పుస్తకాలను ముఖ్యఅతిథులు ఆవిష్కరించారు. కందకుర్తి ఆనంద్, మోహన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులకు కార్పొరేషన్ పదవులు

కంఠేశ్వర్, మార్చి 17 : ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు కార్పొరేషన్ పదవులను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా, బాన్సువాడకు చెందిన కాసుల బాలరాజును ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా, రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాల్కొండకు చెందిన మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర కిసాన్ కేత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డిని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించింది.

శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సంపూర్ణం

సారంగాపూర్, మార్చి 17 : మండలంలోని అశోక్‌ఫారంలో ఉన్న శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం సంపూర్ణమయ్యాయి. వేదపండితులు సముద్రాల శ్రీధరాచార్యులు, మాకునూరి వెంకటరమణాచార్యుల ఆధ్వర్యంలో మహాపూర్ణాహుతి, చక్రస్నానం, తీర్థగోష్టి, ద్వాదశ ఆరాధన, దేవతోద్వాసన, ఏకాంతసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

23న సాయిబాబా ఆలయంలో వేలం పాట

సారంగాపూర్, మార్చి 17 : శ్రీరామనవమిని పురస్కరించుకొని నగర శివారులోని మాధవ్‌నగర్ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఈనెల 23న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీరాంరవీందర్‌గుప్తా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి రంగులు వేయడం, స్థల అలంకరణ, విద్యుద్దీపాలంకరణ, క్యూలైన్ల ఏర్పాటు, వంట పాత్రలు, టెంటు సామగ్రి సరఫరాకు కొటేషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. తక్కువ కోట్ చేసిన వారికి పనులు అప్పగిస్తామని తెలిపారు.

పెద్ద గోసాయి విగ్రహ ఆవిష్కరణ

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గోసంగి సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్

ఆర్మూర్‌టౌన్, మార్చి17: ఆలూర్ మండల కేంద్రంలోని గోసంగి కాలనీలో గోసంగి కులస్తుల ఆరాధ్య దైవం పెద్ద గోసాయి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని సంఘ సభ్యులు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోసంగి సంఘం జిల్లా అధ్యక్షుడు గంధం రాజేశ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పరీక్షల సమయానికి బస్సులు

బోధన్, మార్చి 17: పదో తరగతి పరీక్షల సందర్భంగా ఈనెల 18 నుంచి బోధన్ ఆర్టీసీ డిపో పరిధిలోని ఆయా గ్రామాల మీదుగా బస్సులను పరీక్షల సమయానికి అనుకూలంగా నడుపుతామని డీఎం శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పరీక్షా సమయానికి ముందుగానే బస్టాప్‌ల వద్దకు చేరుకోవాలని ఆయన సూచించారు. ఉచిత రవాణా విషయంలో గతంలో పాటించిన నిబంధనలే ఈ సారి కూడా వర్తిస్తాయని ఆయన వెల్లడించారు

రెంజల్ ఎస్సైగా సాయన్న

రెంజల్, మార్చి 17: స్థానిక ఎస్సైగా ఈ.సాయన్న ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ ఎస్సైగా విధులు నిర్వహించిన సాయన్న బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్సై ఉదయ్‌కుమార్ ధర్మపురి మండలానికి బదిలీ అయ్యారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ. 50వేల కంటే అధికంగా నగదును తీసుకెళ్తే సరైన పత్రాలు తమవద్ద ఉంచుకోవాలని సూచించారు. అక్రమరవాణాపై ఉక్కు పాదం మోపుతామని, ప్రజలు తమతో సహకరించాలని కోరారు.

ధర్పల్లి ఎస్సైగా విక్రమ్..

ధర్పల్లి, మార్చి 17 : ధర్పల్లి ఎస్సైగా విక్రమ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన వంశీకృష్ణారెడ్డి ఎడపల్లికి బదిలీపై వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న ఎస్సై విక్రమ్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

భగవద్గీత పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

బాల్కొండ, మార్చి 17 : మండల కేంద్రంలోని మదర్ థెరిస్సా పాఠశాల 5వ తరగతి విద్యార్థిని కుమారి వినూహ్య రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీల్లో పాల్గొని 4వ స్థానంలో నిలిచిందని కరస్పాండెంట్ రామలక్ష్మి, డైరెక్టర్ సుబ్బారెడ్డి, హెడ్మాస్టర్ నర్సింహారెడ్డి తెలిపారు. ఆదివారం వారు విద్యార్థినిని అభినందించారు.

విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

అకాలవర్షం.. నేలవాలిన పంటలు

- ఆందోళన చెందుతున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

లింగాపూర్ సమీపంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పొతంగల్– లింగాపూర్ మధ్య నేలవాలిన వరి పంట

కోటగిరి/ వర్ని/ ఖలీల్‌వాడి/ ధర్పల్లి/ సారంగపూర్/సిరికొండ/ ఇందల్వాయి/ మార్చి 17 : జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి ఈదురుగాలులు, వడగండ్లతో కూడిన వర్షం.. రైతులను ఆగం చేసింది. కోతదశలో ఉన్న పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు ఆదివారం పరిశీలించారు.

ఉమ్మడి కోటగిరి మండలంలోని వివిధ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారి శ్రీనివాస్ పరిశీలించారు. వర్ని మండలంలోని సిద్ధాపూర్, పైడిమల్, జలాల్‌పూర్‌లో సుమారు 10 ఎకరాల్లో మక్కజొన్న పంట నేలకొరిగింది. నగరంలోని అభయహస్తం కాలనీలో గుడిసెలు కూలిపోయాయి. 250 కుటుంబాలు ఏడాదిన్నర కాలంలో నివాసముంటున్నాయని, నిరాశ్రయులైన వారిని ఆదుకోవాలని ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధన కమిటీ అధ్యక్షుడు ద్యారంగుల కృష్ణ, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి మల్యాల గోవర్ధన్ కోరారు. ధర్పల్లి మండల కేంద్రంలో వరి నేలకొరిగింది. మామిడి పిందెలు నేలరాలాయి. ధర్పల్లి మండలంలోని ప్రాజెక్టు రామడుగు, హొన్నాజీపేట్‌లో దెబ్బతిన్న పంటలను ఏడీఏ ప్రదీప్ కుమార్, ఏవో ప్రవీణ్ పరిశీలించారు. రూరల్ మండలంలో 54 ఎకరాల్లో వరిపంట నేలకొరిగిందని మండల వ్యవసాయాధికారి హీరా జాదవ్ తెలిపారు. సిరికొండ మండలం కొండూర్‌లో ఏడీఏ ప్రదీప్ కుమార్ పెద్దవాల్గోట్, మైలారం, చీమన్‌పల్లి, పందిమడుగు, తాటిపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి వెంకటేశ్ పరిశీలించారు. మండలంలో 1552 ఎకరాల్లో వరి పంట దెబ్బ తిన్నట్లు అంచనా వేసినట్లు వెల్లడించారు. ఇందల్వాయి మండలంలోని చంద్రాయన్‌పల్లి డిచ్‌పల్లి మండలంలోని కొరట్‌పల్లి, సుద్దులం, యానంపల్లి గ్రామంలో జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేశారు.

అభయహస్తం కాలనీలో దెబ్బతిన్న రేకుల షెడ్లను పరిశీలిస్తున్న నాయకులు

సిద్ధాపూర్ శివారులో నేలకొరిగిన జొన్న

పంట నష్టంపై సర్వేకు ఆదేశించాం : బోధన్ ఎమ్మెల్యే

బోధన్ రూరల్/ఎడపల్లి/మాక్లూర్/ వేల్పూర్, మార్చి 17: అకాలవర్షానికి నష్టం వాటిల్లిన పంటలను సర్వే చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోధన్, సాలూరా మండలాల్లోని సాలూరా క్యాంప్, నాగన్‌పల్లి, కొప్పర్తిక్యాంపు తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆయన ఆదివారం రైతులతో కలిసి పరిశీలించారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపడతామన్నారు. బోధన్ సాలూరా మండలాల్లో సుమారు ఐదువందల ఎకరాల మక్కజొన్న పంట వేశారని, ఇందులో పెద్దమొత్తంలో దెబ్బతిన్నదని అన్నారు. ఎడపల్లి మండలంలో నేల కొరిగిన వరి పంటలను మండల నాయకులతో కలిసి పరిశీలించారు. పంట నష్టంపై నివేదిక అందజేయాలని అధికారులను కోరారు. సుమారు 1300 ఎకరాలపై చిలుకు పంటలకు నష్టం వాటిల్లినట్లు ఏవో సిద్ధిరామేశ్వర్ తెలిపారు. మాక్లూర్ మండలంలోని మాదాపూర్, మదన్‌పల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో మామిడికాయలు నేలరాలాయి. కొన్ని గ్రామాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది.

పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ రైతు సంఘం నాయకుడు మిట్టాపల్లి మహిపాల్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వడగల్ల వానతో పంట నష్టం జరిగిందని, నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను సిరికొండ ఎంపీపీ మలావత్ సంగీతా రాజేందర్, వైస్ ఎంపీపీ తోట రాజన్న, బీఆర్‌ఎస్ నాయకుడు నర్సారెడ్డి హైదరాబాద్‌లో ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించడంతో శుభాకాంక్షలు తెలిపారు. – సిరికొండ, మార్చి 17

సంక్షిప్తంగా..

- **పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి -** వర్ని, మార్చి 17 : నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షలకు మండలంలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవో శాంతకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 325 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, జాకోర, వడ్డేపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.
- **శ్రీసాయి విద్యాలయంలో ఉచిత వైద్యశిబిరం -** చందూర్, మార్చి 17 : మండలకేంద్రంలోని శ్రీ సాయి విద్యాలయంలో సూర్య ఆరోగ్య సంస్థ – నిజామాబాద్, శ్రీ కాకతీయ చేయూత చారిటబుల్ ట్రస్ట్–బోధన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. మొత్తం 320 మందికి వైద్యపరీక్షలు, 220 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.
- **ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం -** సారంగాపూర్, మార్చి 17 : నగరంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలకు చెందిన 30 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మండలంలోని ఆకుల కొండూర్‌లో చేపట్టిన శిబిరం ఆదివారం కొనసాగింది. గ్రామంలోని హనుమాన్ ఆలయ ఆవరణలో మొక్కల చుట్టూ పెరిగిన గడ్డి, చెత్తను వలంటీర్లు తొలగించారు.
- **వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం -** ఇందల్వాయి, మార్చి 17 : మండలంలోని మల్లాపూర్‌లో ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సోమవారం రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.
- **కొనసాగుతున్న ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు -** ఇందల్వాయి, మార్చి 17 : మండలంలోని తిర్మన్‌పల్లిలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి ధ్వజస్తంభానికి ఆదివారం పూజలు చేశారు. వేదపండితుడు గంగాప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. సోమవారం ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉంటుందని తెలిపారు.
- **కమిటీల ఏర్పాటుకు చర్యలు–** బాల్కొండ, మార్చి 17: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ అన్నారు. ఆదివారం ఉపాధ్యాయులతో మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, కంప్యూటర్ ఆపరేటర్లు సీఆర్‌పీలు పాల్గొన్నారు.
- **వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం–**బాల్కొండ, మార్చి 17: వన్నెల్(బీ) గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. చివరిరోజు మంగళవారం స్వామివారి కల్యాణం, అనంతరం అన్నదానం, రథోత్సవం ఉంటుందని ఆలయ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు.
- **రేపు వాహనాల వేలం –**భీమ్‌గల్, మార్చి 17: వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న రెండు బైక్‌లను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నిజామాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం భీమ్‌గల్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్ ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారుకోరారు.
- **శుభాకాంక్షలు–** భీమ్‌గల్, మార్చి 17: రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమితులైన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని ఆయన నివాసంలో ఆదివారం మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ భీమ్‌గల్ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి తదితరులు పాల్గొన్నారు.
- **విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ–** ఆర్మూర్‌టౌన్, మార్చి17: పట్టణంలోని బధిర పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ, సభ్యులు పట్వారి తులసి, లక్ష్మీనారాయణ, దామోదర్ పాల్గొన్నారు.
- **కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా నితిన్ –** రెంజల్, మార్చి 17: మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన లచ్చేవార్ నితిన్‌కు కాంగ్రెస్ బీసీ మండల అధ్యక్షుడిగా నియామక పత్రాన్ని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదివారం తన స్వగృహంలో అందించారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, దూపల్లి మాజీ సర్పంచి సాయిరెడ్డి, పులిశ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రచారసభలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

- రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్, సీపీ సూచన

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మార్చి 17 : ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సూచించారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్, సీపీ ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు అనుమతులు అందిస్తామని, కనీసం 48 గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించవద్దని, ఇతరులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, తప్పుడు ప్రచారాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాలు, కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 1950 టోల్ ఫ్రీ నంబర్, సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేపట్టవచ్చని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన వాల్ రైటింగ్, పోస్టర్లు, ఫొటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల్లో, పబ్లిక్ స్థలాల్లో 48 గంటల్లో, ప్రైవేట్ స్థలాల్లో 72 గంటల వ్యవధిలో తొలగించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్,కిరణ్‌కుమార్, ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయి, ట్రైనీ ఐపీఎస్ చైతన్యారెడ్డి, అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

30న ఎంపీపీపై అవిశ్వాస సమావేశం

డిచ్‌పల్లి, మార్చి 17 : డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె శ్రీనివాస్ అలియాస్ భూమయ్యపై ఈనెల 30న అవిశ్వాస సమావేశం నిర్వహించనున్నట్లు రూరల్ ఆర్డీవో రాజేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు ఎంపీటీసీలకు శనివారం నోటీసులు పంపించారు. డిచ్‌పల్లి మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఇటీవల రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో ఏడుగురు బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారు. అవిశ్వాసం కోసం 9 మంది మెజార్టీ సరిపోతుంది. అయితే ప్రస్తుతం 13 మంది ఎంపీటీసీలు అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్నారు. ముల్లంగి(బీ)కి చెందిన నడ్పల్లి–2 ఎంపీటీసీ చిన్నోళ్ల నర్సయ్యను ఎంపీపీగా చేయనున్నట్లు సమాచారం.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌టౌన్,మార్చి17: ఆలూర్ మండలకేంద్రంలోని వీధి నంబర్18లో తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఆలూర్‌కు చెందిన శివలింగం కుటుంబీకులు శుక్రవారం ఇంటికి తాళం వేసి బంధువుల పెళ్లికి వెళ్లారు. అదేరోజు అర్ధరాత్రి దొంగలు తాళం పగులగొట్టి రెండున్నర తులాల బంగారం, పది వేల రూపాయల నగదు, సామగ్రిని చోరీ చేసి ఇంట్లో కారం పొడిచల్లి వెళ్లిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తెలిపారు.

జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్ పరిశీలన

కమ్మర్‌పల్లిలో చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఆర్మూర్ ఏసీపీ బసవారెడ్డి

కమ్మర్‌పల్లి, మార్చి 17: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును ఆదివారం సాయంత్రం ఆర్మూర్ ఏసీపీ జీ. బసవారెడ్డి పరిశీలించారు. స్థానిక ఎస్సై రాజశేఖర్ చెక్‌పోస్ట్‌లో మిగతా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా సరిహద్దులోని కమ్మర్‌పల్లిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు.

చెక్‌పోస్ట్ కోసం స్థలం..

భీమ్‌గల్, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వాహనాల తనిఖీ కోసం చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని ఎస్సై హరిబాబు, డిప్యూటీ తహసీల్దార్ మధు పరిశీలించారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ ధనుంజయ్, కానిస్టేబుల్ రాజ్‌కుమార్ ఉన్నారు.

ఎంజే దవాఖానలో కు.ని. ఆపరేషన్లు

శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా

ఆర్మూర్‌టౌన్, మార్చి17: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా పట్టణంలోని ఎంజే దవాఖానలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను డాక్టర్ మధుశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా హాజరై శిబిరాన్ని పరిశీలించారు. మహిళల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, మార్చి17: మానసిక పరిస్థితి బాగాలేక ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. సీఐ రవికుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బండి గంగాధర్(64)కు కుటుంబసభ్యులతో సఖ్యత లేదు. మనోవేదనతో ఆదివారం మధ్యాహ్నం ఆర్మూర్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గంగాధర్ రెండు నెలల క్రితం జరిగిన హత్య కేసులో జైలు శిక్ష అనుభవించాడు. కిడ్నీ వ్యాధిగ్రస్తుడు కావడంతో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. హత్య కేసులో బెయిలుపై బయటికి వచ్చాడు. గంగాధర్ మృతిపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదని సీఐ వెల్లడించారు.

యోనో ఎస్‌బీఐ రివార్డ్‌పేర మరో సైబర్ మోసం

శక్కర్‌నగర్, మార్చి 17: పోలీసులు ఓ వైపు సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అవగాహన కల్పిస్తున్నా.. సైబర్ నేరగాళ్ల వలలో ఎవరో ఒకరు చిక్కుతున్నారు. ఇటీవల బోధన్ పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన షేక్ షెహబాజ్ అనే వ్యక్తికి యోనో ఎస్‌బీఐ రివార్డ్స్ పాయింట్స్‌పై ఓ మెసేజ్ వచ్చింది. అందులో ఉన్న లింక్‌ను క్లిక్ చేశాడు. బ్యాంక్ అకౌంట్ నంబర్, ఓటీపీ నంబర్లను పంపగానే, అతని అకౌంట్ నుంచి రూ.25,051 డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. ఆందోళన చెందిన బాధితుడు ఆదివారం బోధన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్. వీరయ్య తెలిపారు.

టోల్‌ప్లాజా వద్ద కారు దగ్ధం

ఇందల్వాయి, మార్చి 17 : ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద కారులో ఆదివారం మంటలు చెలరేగి దగ్ధమైంది. నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ కారు టోల్‌ప్లాజా వద్ద ఆగగా.. పొగలు వచ్చాయి. గమనించిన టోల్‌ప్లాజా సిబ్బంది కారును పక్కకు నిలిపివేయించారు. కారులో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది. స్థానిక వాహనదారులు భయంతో పరుగులు తీశారు.

జిల్లా కేంద్రంలోని నిర్మల హృదయ పాఠశాల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ డాక్టర్ రివరెండ్ సిస్టర్, డాక్టర్ నిర్మల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణలు, సాంస్కృతిక నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. – ఖలీల్‌వాడి, మార్చి 17

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ధర్పల్లి, మార్చి 17 : ధర్పల్లి మండలం ప్రాజెక్టు రామడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని తమ జ్ఞాపకాలను నెమరువేసుకొని, ఆప్యాయంగా పలుకరించుకున్నారు. తమకు చదువుచెప్పిన గురువులను సన్మానించారు.

నవజాత శిశు సంరక్షణపై అవగాహన

ప్రైవేట్ దవాఖాన సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఖలీల్‌వాడి, మార్చి 17 : నేషనల్ నియోనెటలజీ ఫోరం –తెలంగాణ (నవజాత శిశు వైద్యుల సంఘం), భారతీయ పిల్లల వైద్యుల సంఘం –నిజామాబాద్ ఆధ్వర్యంలో నవజాత శిశు సంరక్షణపై ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖాన ఎన్‌ఐసీయూ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులకు శిక్షణా శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. నగరంలోని ఐఎంఏ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నవజాత శిశువులకు ప్రాథమిక చికిత్సపై భారతీయ పిల్లల వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అజ్జ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలేశ్ నేతి, నేషనల్ నియోనెటలజీ ఫోరం తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ శ్రీశైలం అవగాహన కల్పించారు. నవజాత శిశు మరణాల సంఖ్య తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యులతోపాటు 150 ప్రైవేట్ మంది ప్రైవేట్ దవాఖానల ఎన్‌ఐసీయూ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా గోదావరి పుష్కర ఘాట్లు

- పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు

రెంజల్, మార్చి 17 : మండలంలోని కందకుర్తి వద్ద గోదావరి పుష్కర ఘాట్లు మట్టి, చెత్తాచెదారంతో అస్తవ్యస్తంగా మారాయి. మూడు నదులు ఒకేచోట కలిసే ఈ త్రివేణి సంగమ క్షేత్రానికి పర్వదినాల్లో పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు తరలివస్తుంటారు. గోదావరిని ఇంటి దేవతగా కొలిచే భక్తులు పర్వదినాలు, అమావాస్య, పౌర్ణమి, శుక్ర, ఆదివారాల్లో వచ్చి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. తలనీలాలు సమర్పిస్తారు. పిండి వంటలతో తయారు చేసిన నైవేద్యంతో కుడిన తెప్పలను నదిలో వదిలి మొక్కులను చెల్లించుకుంటారు. మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల భక్తులు కూడా వస్తుంటారు. 2015లో నిర్వహించిన గోదావరి మహా పుష్కరాల్లో భాగంగా మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా పుష్కర ఘాట్లను నిర్మించారు. మహా పుష్కరాల సమయంలో భక్తులు హుండీలో సమర్పించిన కానుకలు, డబ్బులు, వ్యాపార సముదాయాల రూపంలో దేవాదాయ శాఖకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరింది. ప్రస్తుతం పుష్కర ఘాట్లు, నది ఒడ్డున ఉన్న శివాలయ ఆలనాపాలనా చూసేవారు కరువయ్యారు. పుష్కర ఘాట్లపై మట్టిపేరుకుపోయింది. చెత్తాచెదారం నిండి అధ్వానంగా మారడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. నది ఒడ్డున శివాలయం ఎదుట ధ్వజ స్తంభం మాయమై ఏండ్లు గడుస్తున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారని భక్తులు, స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పుష్కర ఘాట్లపై మట్టి, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయాలని భక్తులు కోరుతున్నారు.

నది శివాలయం ఘాట్‌పై పేరుకుపోయిన మట్టి, చెత్తా చెదారం